క్లుప్తంగా

తిరుమలేశునికి అభిషేక సేవ


పూజలందుకుంటున్న తిరుమలేశుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్‌బీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి అభిషేక సేవ నిర్వహించారు. స్వామి వారిని క్షీరంతో అభిషేకించారు. అనంతరం స్వామిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ముందుగా వేకువ జామునే సామూహిక లలితా పారాయణం చేశారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

అభివృద్ధి పనుల పరిశీలన


కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాత

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని కొత్తకర్ణవానిపాలెంలో 40 లక్షల రూపాయలతో చేపట్టిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న కరణంరెడ్డి, కార్పొరేటర్ దల్లి గోవింద్

పెదగంట్యాడ: ప్రతీ ఒక్కరు తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలన్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటుతున్నట్లు గాజువాక నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ అన్నారు. గొడ్డువానిపాలెం ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో వార్డు అధ్యక్షుడు పేర్ల అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్క నాటారు. కార్యక్రమంలో నాయకులు పి.నాగేశ్వరరావు, రంగనాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాత బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఆరోగ్యం మీ చేతుల్లోనే..


అమరావతి పార్కులో వాకింగ్ చేస్తున్న మహిళలు


వుడా కాలనీ అమరావతి పార్కులో వ్యాయామం చేస్తున్న యువకులు

- శారీరక శ్రమ తప్పనిసరి అంటున్న వైద్యులు
- తు.చ. తప్పక పాటిస్తున్న ప్రజలు
- జిమ్‌లకు క్యూ కడుతున్న యువత
- వాకింగ్, యోగాపై పెద్దవారి ఆసక్తి


వినాయకనగర్ ఆదర్శగ్రౌండ్‌లో ఆటలాడుతున్న బాలలు, యువకులు

పెదగంట్యాడ: ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఇప్పుడు అందరూ వ్యాయామంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఒకప్పుడు క్రీడలపై ఆసక్తి ఉన్న వారు మాత్రమే వ్యాయామం చేసేవారు. కానీ ఇప్పుడు మారిన ఆహారపు అలవాట్లు.. వస్తున్న వ్యాధుల నేపథ్యంలో యువతతో పాటు మధ్య వయసు వారు, వృద్ధులు కూడా నిత్యం వాకింగ్, జాగింగ్, యోగా, ధ్యానంపై ఆసక్తి చూపిస్తున్నారు.

మారుతున్న జీవనశైలి.. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక ప్రగతితో సదుపాయాలు అందుబాటులోకి వచ్చి అందరికీ శారీరక శ్రమ దాదాపు తగ్గిపోయింది. రకరకాల వ్యాపకాల్లో రోజంతా తీరిక లేకుండా గడుపుతున్నప్పటికీ కూర్చుని చేసే పనులే ఎక్కువగా ఉండటంతో ప్రతీ ఒక్కరూ తరచూ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆరోగ్యానికి రోజూ కొద్దిపాటి శారీరక శ్రమ తప్పనిసరి అంటున్న వైద్యుల సూచనలతో ప్రతీ ఒక్కరూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటున్నారు. తమ దైనందిన చర్యలో యోగా లేదా వాకింగ్, జిమ్, క్రీడలు .. ఇలా ఏదో ఒక వ్యాయామాన్ని ఎంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులు, జిమ్‌లు చిన్నాపెద్దలతో కళకళలాడుతున్నాయి.

వేకువజామున, సాయంత్రం వేళల్లో పరిశీలిస్తే ఆరోగ్యంపై ప్రజలు తీసుకుంటున్న శ్రద్ధ ఇట్టే అవగతమవుతోంది. మండలంలో గాంధీ పార్కు, ఇండోర్‌స్టేడియం, హౌసింగ్ బోర్డు పార్కుల్లో వాకింగ్, జాగింగ్, వ్యాయామం చేస్తూ ఉంటారు. మహిళలు, పెద్దలు నడక మార్గాన్ని ఎంచుకుంటుండగా.. బాలబాలికలు క్రీడల్లో నిమగ్నమవుతున్నారు. మహిళలు నడకతో


చిన్నారుల రన్నింగ్ ప్రాక్టీస్

పాటు ఓపెన్ జిమ్‌లలో తేలికపాటి వ్యాయామాలు కూడా చేయడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

పెరుగుతున్న జిమ్‌లు

ఒకప్పుడు నగర ప్రాంతాల్లోనే కనిపించే వ్యాయామ కేంద్రాలు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ఏర్పాటవుతున్నాయి. మండలంలో సుమారు 40 నుంచి 45 వరకు జిమ్‌లు ఉన్నాయి. ప్రతీ జిమ్‌కు రోజుకు 100 నుంచి 200 మంది వరకు వ్యాయామం కోసం వస్తున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుల్లో కూడా వాకింగ్, జాగింగ్‌కు సుమారు 200 నుంచి 300 మంది వస్తున్నారు. ఇక పార్కులు, మైదానాలు ఉదయం, సాయంత్రం చిన్న, పెద్ద అందరితో కళకళలాడుతున్నాయి.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట గ్రీన్ సిటీ ఆవరణలోని శ్రీలక్ష్మి ఆండాళ్ సమేత శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. వారం రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం భక్తి గీతాంజలి గానామృతం చేశారు. ముగింపు సందర్భంగా విశేష అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఎల్‌సీ ఎదుట హాజరుకాని ఉక్కు అధికారులు

ఈ నెల 16కు వాయిదా

అగనంపూడి: విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు శరగడం రామారావు సామాజిక భద్రతా పింఛన్ చెల్లింపు విషయంలో రికార్డులతో హాజరు కావాలన్న ఆదేశాలను ఉక్కు అధికారులు బేఖాతరు చేశారు. రామారావు కాంట్రాక్ట్ కార్మికునిగా 28 ఏళ్ల పాటు సేవలు అందించారు. ఆ సమయంలో ఈపీఎఫ్‌ను జీతం నుంచి కోత విధించిన ఉక్కు యాజమాన్యం సామాజిక భద్రత పింఛన్ చెల్లింపు విషయానికి వచ్చేటప్పటికీ ఈపీఎఫ్ అధికారులకు వివరాలు ఇవ్వకపోవడంతో ఈపీఎఫ్ అధికారులు పింఛన్ చెల్లింపు సాధ్యం కాదని తెలిపింది. దీనిపై రామారావు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో, అధికారులు దానిని విశాఖ రీజనల్ లేబర్ కమిషనర్‌కు పంపించారు. దీంతో ఈ నెల 5వ తేదీన రికార్డులతో హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆర్‌ఎల్‌సీ ఆదేశించారు. వీటిని పట్టించుకోని అధికారులు హాజరు కాకపోవడంతో ఈ నెల 16వ తేదీకి మళ్లీ వాయిదా వేశారు. తాము హాజరైనా ఉక్కు యాజమాన్య ప్రతినిధులు హాజరు కాలేదని, దీంతో వాయిదా వేసినట్టు బాధితుడు రామారావు, సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు తెలిపారు.

త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారం

- అర్జీదారులతో మర్యాద మెలగండి
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశం
- మూడో పట్టణ పోలీసు స్టేషన్ సందర్శన
- వ్యర్థాలు పేరుకుపోవడంపై ఆగ్రహం


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

బీచ్ రోడ్డు: ఫిర్యాదులను పారదర్శకంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆకస్మాత్తుగా మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆనుకొని ఉన్న ఖాళీ ప్రాంతాలను పరిశీలించారు. వ్యర్థాలు పేరుకుపోవడంపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో ఎల్లవేళలా సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించాలన్నారు. అన్ని రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లో ఉండాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సిబ్బందిని అడిగారు. సిబ్బంది తెలిపిన పలు సమస్యలకు సీపీ తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నారు. అదే విధంగా సిబ్బందికి కుటుంబ, ఉద్యోగం పరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా 79950 95799 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాద మెలగాలన్నారు. వారిని కూర్చోబెట్టి సమస్యలు వినాలని, వాటిని పారదర్శకంగా విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సూచించారు. క్రైమ్ పోలీసు స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన, వినియోగంలో లేని వాహనాలను పాడవకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో పలు విభాగంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సందర్శించిన సీపీ.. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. బ్లూ కోట్స్, ట్రాకోట్స్ పని తీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను నిత్యం చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. పర్యాటక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ఈ స్టేషన్ పరిధిలో ఎటువంటి దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా క్రైం పోలీసులు కృషి చేయాలన్నారు. ఇందు కోసం సీసీ కెమెరాల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ ప్రతి కదలికపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి రవాణాపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు.

హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో అతిథి ఉపన్యాసం


కాంతి కారంచేటిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాలలోని హ్యూమన్ జెనెటిక్స్ విభాగంలో శుక్రవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఏక ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ స్పెషల్ ఎడ్యుకేటర్ కాంతి కారంచేటి అండర్‌స్టాండింగ్ డిజెబిలిటీస్-డయాగ్నోసిస్ టు డిస్టెంట్ డ్రీమ్స్ అంశంపై ప్రసంగించారు. వివిధ రకాల డిజెబిలిటీస్, చికిత్స విధానాలు, నివారణ అవకాశాలు వివరించారు. కుటుంబ సభ్యులు, పౌర సమాజం అనుకూల దృక్పథంతో మెరుగైన జీవనం అందించడానికి సహకారం అందించాలన్నారు. ఈ సదర్భంగా కాంతి కారంచేటిని విభాగం తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మి, విశ్రాంత ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై మంత్రికి వినతి

గాజువాక : ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) ప్రతినిధులు రాష్ట్ర విద్యా శాఖామంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు విజయవాడలో ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్టీఈ యాక్ట్ ద్వారా గడిచిన మూడేళ్లగా ప్రైవేట్ బడుల్లో ఉచిత అడ్మిషన్లు పొందిన వేలాదిమంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. పదో తరగతి హిందీ, సోషల్ సిలబస్ అధికంగా ఉందని, సిలబస్‌ను తగ్గించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అప్సా నాయకులు వి.సుందరం, సుబ్రమణ్యరాజు, ఎం.జనార్ధన్, పి.భాస్కరరావు, రామ్మోహనరావు తదితరులున్నారు.

సామూహిక ధ్యానం


సామూహిక ధ్యానం చేస్తున్న సభ్యులు

పెదగంట్యాడ: అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో శుక్రవారం సామూహిక ధ్యానం నిర్వహించారు. హిమాలయ తత్వదర్శి, పీఎస్ఎస్ఎం మీడియా లిమిటెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ నంద ప్రసాదరావు జయంతి సందర్భంగా అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వాహకుడు శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నంద ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు అప్పలరాజు, పాల చినఅప్పారావు, దేవిక, తులసి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం


అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేటి నుంచి వారాహి నవరాత్రి ఉత్సవాలు


దేవీపురంలో కొలువైన రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో శనివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ వారాహి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు గురుమాత అన్నపూర్ణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించనున్నారు. శనివారం కలశ స్థాపన,గోమాత పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14న వారాహి యంత్ర సిరిజ్యోతి పూజ,సామూహిక వారాహి సహస్ర నామార్చన పూజలు చేయనున్నట్టు గురుమాత పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం


కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: వారంలో ఒక రోజు.. ప్రతీ శుక్రవారం ప్రతి ఒక్కరూ విధిగా డ్రై డే పాటించాలని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట హైస్కూల్‌లో శుక్రవారం డ్రై డేపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయవద్దని కోరారు. దీని వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కోరారు. అలాగే విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివ కుమార్, సూర్యనారాయణ, అప్పలరాజు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషను విస్మరించడం తగదు


ప్రసంగిస్తున్న కవి తమ్మిరాజు

గాజువాక : తెలుగు భాష ప్రాముఖ్యత క్రమేపీ అంతరించిపోతోందని పలువురు కవులు ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలకు ఇది దిగ్భ్రాంతిని కలిగించే విషయమన్నారు. తెలుగు భాష పరిరక్షణపై స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కవులు ప్రసంగించారు. కవి ఎస్.తమ్మిరాజు మాట్లాడుతూ తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని పిలుస్తారని, అంతటి ప్రాచుర్యం గల తెలుగు ప్రాభవం కోల్పోతోందని అన్నారు. రచయిత మాధవీ సనారా మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని, విద్యార్థులు ఆంగ్ల భాషను నేర్చుకున్నప్పటికీ మాతృభాషను విస్మరించరాదని అన్నారు. కె.మల్లీశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ మాతృభాష పట్ల మక్కువ పెంచుకోవాలని, భాష అభ్యున్నతికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, అధ్యాపక ప్రతినిధులు వై.ఈశ్వరరాజు, ఎస్.వి.కృష్ణ, రామ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టాల నెపంతో ప్రైవేటీకరణకు కుట్ర

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి వర్కింగ్ క్యాపిటల్ అందించాలని ఉక్కు విశ్రాంత అధికారి మాటూరి శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పదేళ్ల క్రితం లాభాల బాటలో పయనించిందని, విస్తరణ పనులతో ఆశాజనకంగా మారిన పరిశ్రమను కావాలని కుట్ర పన్ని నష్టాల ఊబిలోకి నెట్టేసి, ఆ నెపంతో ప్రైవేటీకరణకు పూనుకున్నారని ఆరోపించారు. ఆసియా ఖండంలో పేరెన్నికగన్న విశాఖ ఉక్కు దుస్థితికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలేనని పేర్కొన్నారు. నాయకుడు బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్థిక పరిపుష్టితో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను అతి తక్కువ ధరకు విక్రయించి ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగించాలని ప్రభుత్వ పెద్దలు చూస్తుండడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రమణ, నీలకంఠం, హరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో మార్పులతో క్యాన్సర్‌కు చెక్


విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న రామ్మోహనరావు

అక్కిరెడ్డిపాలెం: మంచి ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని ఏఎంఏఎల్ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ హెచ్‌వోడీ కె.రామ్మోహనరావు అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిపై దేశ విదేశాల్లో 199 సదస్సులను నిర్వహించామని, ఇది 200వ సదస్సు అని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. బ్లడ్ క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్‌ల గురించి తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీ


విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా సమన్వయకర్త రూపావతి తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల పాఠశాలల్లోని 2024–25 సంవత్సరానికి గాను మిగులు సీట్లు భర్తీకి సబ్బవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 11 గురుకులాల్లోని బాలబాలికలకు 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీకి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించారు. ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్. రూపావతి అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రవేశాల కోసం హాజరయ్యారు. కార్యక్రమంలో సబ్బవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రామకృష్ణతో పాటు మిగిలిన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అర్చకులు అందజేశారు.